# వైకుంఠస్వప్నం

కలక్టరుగారిదగ్గరనుంచి ప్రత్యేకంగా వచ్చిన తాఖీదుచూడ్డంతోనే మున్సబు రాం నాయుడు చాలా ఆశ్చర్యపోయాడు. పడక కుర్చీ లో పడుకుని ఎన్నో పర్యాయాలు పిచ్చెక్కినవాడిలా చదివిందే చదవడం - నిజంగా అతనికి నమ్మకం కుదరలేదు. తనకళ్లు తనని ద్రోహం చేస్తున్నాయేమో ననుకున్నాడు. ఉదయంనుంచి లెక్క కూడా లేదు. ఎన్నో పర్యాయాలు చదువుకున్నాడు. ఆరో క్లాసు చదువుకుంటున్న మనుమడి చేత రెండుమూడు పర్యాయాలు చదివించాడు. ఆఖరికి గొలుసు కట్టులో వున్న కలక్టరుగారి తెలుగు సంతకంచూసి, ఇందులో ఏమీ అబద్ధం లేదూ అన్న నిర్ధారణకి వచ్చాడు. అదీ స్వయంగా తాశీల్దారుగారు కచ్చేరికి పిలిపించి కుర్చీ వేయించి ఎంతో మర్యాదచేసి అతనికి ఆ తాఖీదు అందించారంటే హాస్యానికైనా అందులో అబద్ధం వుంటుందని ఎవరైనా వూహలో నైనా అనుకుంటారనుకోవడం శుద్ధపొరపాటు.

**శ్రీ శ. పైడారావు**

మరో పర్యాయం జేబులో పెట్టిన తాఖీదు పైకి తీసి మీదనుంచి క్రిందవరకూ అతిజాగ్రత్తగా చదువుకున్నాడు. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. తనలో తాను ఎన్నో ఆలోచనలలో పడ్డాడు.

ఇకమీదట తన గ్రామస్థులు ఎండాకాలంలో మైలున్నరదూరంలో వున్న బుచ్చన్న కోనేరుకు ఎగబ్రాక నవసరం లేదు. ఆ వెధవ చెరువు బాగుచేయడానికి తన తాతముత్తాతలు - తండ్రీ ఎంతో డబ్బుకూడా ఖర్చుపెట్టి ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలులయ్యారు. వారసత్వ ప్రకారం మున్సబీ రాగానే తనూ ప్రయత్నాలుచేశాడు. అసలు తనకు ఏ. కోశాన్నా నమ్మకంలేదు కూడాను, రివాజు ప్రకారం ఓ కాగితంముక్క రాసి పడేశాడు. అప్పుడే రెండుపుష్కరాలు దాటేసింది. పూర్తిగా మర్చిపోయాడు. అటువంటిది అనుకోకుండా ఇట్టే అయి కూర్చుంది. ఇదొక్కటే కాదు! ఇంతవరకూ తనలో కాని తన గ్రామస్థుల ఆలోచనలో కూడా రాని కాలవమీద బ్రిడ్జితో సహితం రోడ్డు, ఊరికి ఎలక్ట్రిసిటీ చెరువుతోపాటు ప్రభుత్వం మంజూరు చేసిందంటే ఇదంతా తన అదృష్టం. ముఖ్యంగా తను బాగుపడేరోజులు వచ్చాయి. రోడ్డు ఎప్పుడైతే పడుతుందో బస్సురూటుకూడా వస్తుంది. దాన్ని ఎలాగైనా తనే కొట్టేస్తాడు. తనకు పోటీ ఎవరొస్తారు? చక్కా చిన్నోడ్ని అందులో ఇరికించి వెయ్యొచ్చు. వెధవ జులాయిగా తిరిగి పాడయి పోతున్నాడు. ఆ వుద్యోగం వాడికి సరిపోతుంది కూడాను. ఇక పెద్దోడికంటేకట్టే కాలవమీద బ్రిడ్జికంట్రాక్టు ఎలక్ట్రిసిటీ ఎలాగూ పడుతుంది కాబట్టి ఊరవతల ఎరుకలవాళ్ల పందులు విహారంచేస్తున్న తనగొడ్డుబంజరులో ముందు తడికలతో సినీమా హాలు ప్రారంభించి దానిమీద వచ్చిందాంతోనే చక్కగా సిమెంటుది కట్టెయ్యొచ్చు. అది తను స్వంతంగా చూసుకు పోతాడు. అంతగా డబ్బు అవసరముంటే గున్నయ్యశెట్టి వున్నాడుగా. మెల్లిగా వాటాకి కుదుర్చుకుని తరువాత ఎలా జరిగితే అలా జరుగుతుంది. ఇంతకూ తను గ్రామాధికారి. అసలు జాగా తనది. మొత్తంమీద తను బాగుపడే రోజులు వచ్చాయి. తనగ్రామం కొద్దిరోజుల్లో బస్తీ అయి కూర్చుంటుంది. గోలపెడ్తున్న ఆడపిల్లలకి తలా అయిదేసి 'ఎకరాలు ఫస్టుక్లాసయిన పల్లపు భూమి కొని పారెయ్యొచ్చు.


రెండునెల్లక్రితం తను అవసర మొచ్చి గొడ్డుబంజరును ఎకరంయాభై రూపాయలకు అమ్మజూపితే 'ఎకరం ఎంతా' అని ఎవరూ అడగడానికైనా రాలేదు. అదీ మంచికే వచ్చింది. గొడ్డు - బంజరు, బంగారు - బంజరయింది.

పాపం! గున్నయ్య శాఖ వ్యాపారాలు లేవని గోలపెడ్తున్నాడు. ఆ కేవసుషాపు అతనికే ఇచ్చేస్తే చాలా బాగుంటుంది. ఆ మాత్రం అభిమానం చూపిస్తే ముందుకు తనెలా చెప్పితే అలా వింటాడు. సినీమా హాలుకూడా పక్కా, కాంక్రీటుతో ఈ మధ్య రాజుగారు పట్టణంలో కట్టిన రెండంతస్థుల పరమేశ్వరీ ప్యాలసులా తయారయి కూర్చుంటుంది.

రానున్న అదృష్టాన్ని అభినందించుకుంటూ, ఈసంగతి ఎకాఎకీని గ్రామంలో వున్న నల్గురిపెద్దల చెవినీ వేయాలన్న వుబలాటం పుట్టగానే, హారిమీద పిడుగు పడినా లెక్క చేయకుండా, మధ్యాహ్నం భోజనం అవ్వగానే, పడక వేసి సాయంత్రం అయిదుగంటలవరకూ నిద్ర తీసే మున్సబు రాంనాయుడు వెంటనే గ్రామచావడికి ప్రయాణమయ్యాడు.

భోజనం అవ్వగానే ఎక్కడికో ప్రయాణం కడుతున్న భర్తను చూడ్డంతోనే, భార్య ఎంతైనా ఆశ్చర్యపోయింది. కుదకు తన మామగారికి వచ్చేప్రాణం పోయేప్రాణమని ఇంటందరూ గొల్లుమని ఏడుస్తుంటే, పశువుల శాలలో సుఖంగా నిద్రతీసి ఆయన వచ్చిన అరగంటకు ఏమిటయిందని లేచి వచ్చిన భర్త ఈరోజు, భోజనం


## కొత్త కార్బైడ్ గాస్ లాంతరు




చాలాకాలం మనకు శ్రేష్టమైనది. మంచి ప్రకాశ వంతమైన వెలుతురునిచ్చును. 12 సం॥ లు గ్యారంటీ ఖరీదు రు 18/- లు పోస్టేజి ప్యాకింగు రు. 5/- లు అదనం. ఈ ఖరీదు 15 రోజుల వరకు మాత్రమే. తరువాత రు 40/- లకు హెచ్చింపబడును.

INTERNATIONAL TRADERS

(A W.) P. Box 9756, CALCUTTA-7.

అవ్వగానే చుట్టయినా కాల్చకుండా ఎక్కడికో ప్రయాణ సిద్ధమవుతుంటే, వెళ్లబోతున్న వాడిని 'ఎక్కడికి' అన్న ప్రశ్న వేసే ధైర్యం చాలక, రెండుకళ్లూ అప్పగించి నిలబడిపోయింది మున్సీబు భార్య.

వీధి అరుగుమీద కునికిపాట్లు పడుతున్న బారిక కొండడ్ని మున్సీబురాంనాయుడు కేకపెట్టి "ఒరేయి కొండా! చూడూ, ముందు గున్నయ్యశెట్టిని, మా వెంకన్న మామని తతిమ్మా పెద్దకాపుల్ని, నేను అర్జంటుగా విలేజికచ్చేరికి రమ్మన్నానని చెప్పు" అని వున్న నల్గురి పెద్దలకీ కబుర్లుపంపి బట్టలువేసుకోడానికి గదిలోకి వెళ్లిపోయాడు.

కబురందగానే పెద్దలందరూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ చావడిలో చేరారు. పాపం! గున్నయ్యశెట్టి కాళ్లు కడుక్కుని భోజనానికి సిద్ధమవుతున్నవాడు, మున్సీబుగారి ఆజ్ఞ వినగానే, పుట్టింది మొదలు నేటివరకూ ఎన్నడూ కలలో కూడా మిట్టమధ్యాహ్నం కబుర్లు పంపని రాంనాయుడు అర్జంటుగా రమ్మన్నాడంటే ఏదో ఉపద్రవం ముంచుకు వచ్చిందని ఎలావున్నవాడలా పైమీద తువాలయినా లేకుండా హడావుడిగా పరుగులు పెట్టాడు.

ఒకరికి తెలియకుండా ఒకరు ఒక్కొక్కరే హాజరయి అసలుసంగతేమిటో తెలియక క్షణంలో ఏదో పెద్ద ప్రళయం రాబోతుందని పెద్దలందరూ తమలో తాము తికమకపడ్డారు.

రోజూ ఎండవేళప్పుడు ఖాళీగావున్న గ్రామచావడిలో నడుం వాల్చే మంగలి పెద్దయ్య వెస్తగురువయ్య, చాకలిసుబ్బన్న ఇత్యాదివర్గం సుఖమైన నిద్ర పోయిందని తమలో విసుక్కున్నా ఎన్నడూ లేని గ్రామప్రముఖుల అకస్మాత్తు సమ్మేళనకు కారణం ఏమిటా అని ఆశ్చర్యపోయి కొం సేపట్లో అదే తేల్తుందన్న నిర్ధారణతో చావడిప్రక్కనున్న చింతచెట్టుక్రిందకు మెల్లిగా చేరారు.

మున్సీబు రాంనాయుడు మెల్లిగా చావడిలో కాలుపెట్టాడు. ఉత్సాహంతో తొణికిసలాడుతున్న అతని ముఖం కనబడగానే ఏదో ప్రమాదం రానుందని ఆత్రుతపడుతున్న పెద్దలు కొంత స్థిమితపడ్డారు. చెమటలు కారుతున్న ముఖాన్ని తువాలుతో తుడుచుకుని ప్రక్కనున్న స్తంభాన్ని ఆనుకుని బరువుగా కూర్చుంటూ ఉబుకుతున్న సంతోషంతో "విన్నారటోయి ఈ సంగతి? మన వూరు భాగుపడే రోజులు వచ్చాయి. మనం ఇన్నాళ్ళూ ఏమిటో అనుకున్నాం. నోటికి వచ్చినట్లూ ప్రభుత్వాన్ని పాలకుల్ని దూషించాం. పాపం! వారు పడే శ్రమ మనకేం తెలుస్తుంది? మన గ్రామాల్లాంటివి ఇంకా ఎన్ని వున్నాయో! ప్రసిడెంటుగారు చెప్పింది అక్షరాలా నిజం. అన్యాయంగా ఆయన్ని కూడా ఏమిటేమిటో అన్నాము. నిజం నిలకడమీదగాని తెలియదు.

ఇదుగో చెప్తున్నా వినండి. మన చెరువు మరామ్మత్తుచేసి తూములు కట్టడానికి, గ్రామానికి రోడ్డు వేసి కాలవమీద బ్రిడ్జి కట్టడానికి, ఎలక్ట్రి వేయడానికి ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం, మన గ్రామానికి లక్షా ఏభైవేలు మంజూరయింది. పనులు ప్రారంభించడానికి ఇంజనీరింగువారు రెండుమూడు రోజుల్లో వస్తున్నారని వారికి సహాయంగా వుండమంటూ స్వయంగా కలక్టరుగారు తెలుగులో సంతకంచేసి ప్రత్యేకంగా తాశీల్దారుగారిచేత తాఖీదు పంపించారు" జేబులో వున్న కాగితం మడతని గున్నయ్యశెట్టికి అందించాడు. శెట్టి గట్టిగా చదివి అందరికీ వినిపించాడు.

తమగ్రామానికి కొద్దిరోజుల్లో ఓ గొప్ప-మహాదశ రానుందని అక్కడున్నవారందరూ ఎంతో సంతోషించారు.

ఈ సంగతి జ్యోతిష్యంలో జిల్లాకే పేరెక్కిన తన తాతగారు చక్రంవేసి ఏనాడో చెప్పారని గట్టిగా అందరికీ వినబడేటట్టు అవధానిగారు అన్నారు.

"అవును పెద్దలన్నమాటలు వూరికే పోతాయా?" శెట్టి తాళంవేశాడు.

ఈవార్త అప్పుడే చావడిప్రక్కనున్న చింతచెట్టుదాటి గ్రామంలో పడింది. గ్రామస్థులంతా ఎగిరి స్వర్గాన్ని అందుకున్నట్టయింది. మీసాలు మెలివేసుకుంటూ ఠీవిగా నడుస్తున్న మున్సీబురాంనాయుడిని చూచి ముందుకంటె ఎంతోగౌరవం కనబర్చేరు. అప్పుడే తన నా కున్నట్టు తనకు రాబోయే పేరు ప్రఖ్యాతులకు ప్రథమసోపానం అమరిందన్నట్టు మున్సీబురాం నాయుడు సంతృప్తిచెందాడు.

మూడోనాటికి నెత్తిమీద టోపీలతో సిబ్బందితో సహా ఇంజనీరింగువారు హాజరయ్యారు. చెరువు తనిఖీ చేసి ముందు కొలతలు ప్రారంభించారు. వారికి ఏమైనా అవసరమంటే సరిపెట్టడంకోసరం మున్సీబు పెద్దకొడుకు ఎప్పుడూ వారి వెంట వుంటూ మొత్తంమీద అతనూ వారిలో ఒకడుగా తయారయ్యాడు.

గ్రామస్థులంతా అప్పుడే తాము క్రొత్తగా కట్టిన బ్రిడ్జిమీద నిలబడినటూ తూముద్వారా కాలవలోనుంచి వచ్చిపడిన నీటితో సమృద్ధిగా తమ చెరువు నిండి వున్నట్టు, వీధిలో వెలిగిన ఎలక్ట్రి లైట్ల వెల్గులో తమ పిల్లలు కేకలు పెడ్తూ ఆడుకుంటున్నట్టూ సంతోషించి సంతృప్తి చెందారు.

పదోనాటికి ఎక్జిక్యూటివ్ ఆఫీసరుతో సహా బోర్డుప్రెసిడెంటుగారు దిగారు. గ్రామస్థులందర్ని సమావేశపరచి తాము ఇంకా ముందు ముందుకు చాలా పనులు చేయవలసివుందని, కేవలం తాము ప్రజాసేవకులమని అయినా ప్రజల సహకారం ఎంతైనా కావాలని, ఇంకా ఎన్నో సంగతులు అన్నీ ప్రజల కుపకరించేవే చెప్తూ తామంటే ఇంకా చాలా మంది అపార్థం చేసుకుని చెడ్డ అభిప్రాయాలతో వున్నట్టు కూడా శెలవిచ్చారు. వెంటనే మున్సీబు రాంనాయుడు నిలబడిప్రసిడెంటుగారుఅలా అనడం భావ్యంకాదని నిజంగా ప్రశిడెంటుగారన్నా వారి అధికారమన్నా ఎంతో గౌరవంగా తామంతా సన్నిస్తామని తాను తన గ్రామస్థులతరఫునుంచి హామీ ఇస్తున్నానని ఒక్క పర్యాయం చుట్టూ కూర్చున్నవారందర్ని కలయచూచాడు. అవును నిజమే అన్నట్టు ముందు మున్సీబు కొడుకు 'ప్రెసిడెంటుగారికిజై' అనగానే


రు 1000 బహుమానం

లెప్రసీ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మీ అండ్ కో

(రిజిష్టర్డు)

H O వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే మదరాసు.

గాంధినగర్, విజయవాడ.

కటక్, సికింద్రాబాదు,

రాజమండ్రీ etc.

అందరూ అతన్ని అనుసరించి సభంతా జై జైనినాదం చేశారు.

ప్రసిడెంటుగారు పట్టలేని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ, ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగార్ని అందరికీ పరిచయంచేసి వారు నిర్వహించే పనులగురించి బోధపరచి, అన్ని విషయాల్లోనూ ప్రజలంతా వారికి ఎల్లప్పుడూ సహాయంగా వుండాలని హెచ్చరికచేసి, ఆ సాయంకాలమే ఎంతో ఘనంగా విలేజీ చావడిలో ఎక్జిక్యూటివ్ ఆఫీసుకు ప్రారంభోత్సవం చేశారు. పిల్లలందరికీ పప్పూ బెల్లం పంచారు. మొత్తంమీద ఆ రోజు వూరందరూ తమ తమ గృహాల్లో వివాహాల్లా సందడి చెందారు

ఉత్సవం తర్వాత జరిగిన సభలో బోర్డు ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరు గారు మూడేళ్లు వరుసగా స్కూలు ఫైనలు తప్పి పట్నంలో చాలాకాలం వుండి ఏ వుద్యోగమూ దొరకక ప్రస్తుతం ఇంట్లో వున్న కర్ణంగారి మూడో కొడుకు ప్రసిడెంటుగారి ఔదార్యాన్ని ఎంతగానో ప్రశంసిస్తూ పక్కా గంటసేపు మాట్లాడి విరమించారు.

అనుకున్న దానికంటె రెట్టింపు జయప్రదంగా కార్యక్రమం జరగడంవల్ల ప్రసిడెంటుగారు పూర్తిగా సంతృప్తి చెంది, సభానంతరం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ గారితో ఏవేవో సంగతులు మాట్లాడి చాలా కార్యక్రమాలుండటంవల్ల తాము ఇంత త్వరగా గ్రామస్థులను విడిచిపెడుతున్నందుకు ఎంతో విచారాన్ని సూచిస్తూ మాలపల్లిమీదుగా పట్టణం వెళ్లిపోయారు.

ఎక్జిక్యూటివ్ ఆఫీసు వచ్చింతర్వాత కర్ణంగారి అబ్బాయికి అందులోనే గుమస్తా పనయింది. గున్నయ్య రేషను కొట్టు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచేత ప్రారంభోత్సవం చేయబడింది. పూర్వం ఎన్నో అవస్థలుపడి నాకంటికి కనిపించని బట్టలూ, కిరసనాయిలూ పంచదార మొదలయినవి ప్రసిడెంటు గారి ధర్మమా అని కడుపులో నీళ్లు కదలకుండా అందరికీ చవగ్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు అమ్మిస్తున్నారు. (అమ్ముకుచున్నారు.)

కబురయినా లేకుండా ఓరోజు కలక్టరుగారు దిగబడ్డారు. కాలవమీద వంతెనకట్టడానికి ప్రారంభోత్సవం మూడురోజులలో మంత్రిగారు చేస్తారని ఏర్పాటు కోసరమై ముందుగా అయిదు వందల రూపాయలు అన్నీ సరికొత్త రూపాయనోట్లు అయిదు కట్టలు మున్సీబుకు అడ్వాన్సుగా ఇచ్చి, ఏమేమి చెయ్యాలో నివేదించి, ఎంత ఘనంగా వుంటే అంత పేరు ప్రఖ్యాతులు మున్సీబు వేనని హెచ్చరిక చేసి వెళ్లిపోయారు.

గ్రామమంతా గుప్పుమంది. పదేళ్లకుఱ్ఱాడు మొదలు ఏళ్లునిండిన ముసిలాళ్లవరకూ ఆడ మొగా అనకుండా ఎక్కడ చూచినా కలక్టరుగారు రావడం వెళ్లడంగురించి ఎంతో గొప్పగా చెప్పుకున్నారు ఇక కొద్దిరోజుల్లో తామంతా పట్టణవాస్తవ్యుల వుతామని గొప్పగా మురిసిపోయ్యారు.

అందరికీ చేతులనిండా పని తగిలింది. ప్రతి పనినీ ఎంతో వుత్సాహంతో చేశారు. ప్రతి ఇల్లు సున్నం వేయబడి పచ్చటితోరణాలతో వాకిట పందిళ్లతో కలకలలాడుతూ కళ్లకు ఇంపుగా వుండాలన్న మున్సీబు రాంనాయుడి ఆదేశానుసారంగా ఆడవాళ్లంతా తీరుబడి లేకుండా తన గృహాలంకరణల్లో నిమగ్నులయ్యారు. పిల్లలు తల్లులకు సహాయం చేశారు.

పనులు చకచకా జరిగేయి. మున్సీబు మొదలు కారిక కొండడివరకూ తీరుబడి లేకుండా పోయింది.


'ప్రక్కనే వున్న పట్టణం వాళ్లకి కూడా ఎక్కడ వుందో తెలియని తమ గ్రామానికి మహారాజంతటి మంత్రిగారు వస్తున్నారంటే సామాన్యమా? వారికి తగ్గట్టు మనం మర్యాదలు జరుపకపోతే బాగుంటుందా?' మున్సీబు రాంనాయుడు ప్రజలను హెచ్చరిక చేసి సమాన బాధ్యతలతో పనులు చేయించాడు.

ఊరంతా పచ్చటి తోరణాలు చలువ పందిళ్లతో అలంకరింపబడింది. మంత్రిగారు విచ్చేశారు. వారి వెనుక గొప్ప ఉద్యోగస్తులు, ధనవంతులు, అభిమానులయిన జమీందార్లు, ఇంకా ఎంతోమంది రకరకాల కార్లతో ఎడతెరిపి లేకుండా వచ్చి పడ్డారు.

కాలవ అవతల కారు దిగగానే మున్సీబు రాంనాయుడు జేంసువాళ్ళను హెచ్చరిక చేసి అందరికంటె ముందుగా కొడుకులతో సహా 'మంత్రిగారికి జై' అని దేవుడిగుడి ఆవరణలో పూసిన నందివర్ధన పువ్వులతో మల్లెలను మరపించునట్టి ఎంతో సొంపుగా కట్టబడిన పుష్పమాలను మంత్రిగారి మెడలో వేశాడు. మంత్రిగారు చిరునవ్వు నవ్వుతూ చుట్టూ కలయ చూచి చేతులుజోడించి నమస్కరించారు.

చుట్టూ చేరిన గ్రామపెద్ద లందర్నీ ప్రసిడెంటుగారు ఒక్కొక్కర్నీ మంత్రిగారికి పరిచయం చేశారు మంత్రిగారు ఒక్కొక్క చిరునవ్వు అందరికీ బహూకరించారు. దాంతో అందరూ పేరు పర్వతం ఎక్కారు.

ప్రారంభోత్సవం దిగ్విజయంగా జరిగింది. ప్రసిడెంటుగారు ఇంతకు ముందు వివరించినట్టుగానే తు. చ. తప్పకుండా మంత్రిగారు పదినిముషాలు మాట్లాడారు. తర్వాత ప్రసిడెంటుగారు, కలక్టరు, ఇత్యాదివర్గం, తమ తమ హోదాలవారిగా మంత్రిగార్ని ఎంతో పొగడి, వారు ప్రజలకు చేసిన సేవ, చేయబోతున్న పనులు, తెల్లవాళ్ళ హయాములో వారు చేసి



త్యాగాలు, జైలుజీవితం, మొదలయినవి చెప్తూ ఎంతో ప్రశంసించారు.

మంత్రిగారు స్వయంగా పిల్లలకు తాము తెచ్చిన పిప్పరమెంట్లు పక్షపాతరహితంగా, దూరంగా చెట్లమీద కూర్చున్న మాలపిల్లలకు కూడా సమానంగా పంచిపెట్టారు. ప్రజలంతా వారి న్యాయబుద్ధిని ఒహో! అని ఎంతగానో ప్రశంసించారు.

కాలవకోలతలు అయినట్టు ప్రస్తుతము ప్లానులు వేస్తున్నారని, అవి పూర్తవగానే బ్రిడ్జి పని ప్రారంభించి, ఒక్కొక్కటే, చెరువు మరామత్తు, గ్రామానికి ఎలక్ట్రి త్వరలోనే పూర్తి చేస్తారని, ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తమకు స్వయంగా నివేదిస్తే, పరిష్కరిస్తామని, మొత్తంమీద వీటన్నింటికీ ప్రజల సహకారం ఎంతైనా కావాలని వెళ్లిపోతో ఇంకో పర్యాయం, ప్రజలని మంత్రిగారు హెచ్చరిక చేశారు.

మంత్రిగారు వెళ్ళిన వారంరోజుల తర్వాత తిరిగి ప్రసిడెంటుగారు కలక్టరు గారితో సహా వచ్చి అన్నీ తనిఖీచేసి ఎలక్షనులు దగ్గరపడుతున్నాయని హెచ్చరిక చేసి ఇంతవరకూ మనిషికి ఇంతా అని లెక్క ప్రకారం ఇవ్వబడే కిరసను, బట్టా, పంచదారా మొదలయినవి వివిధమైన అభ్యంతరమూ లేకుండా ఎవరెవరికి ఎంతెంత కావలసివుంటుందో తీసుకోవచ్చునని అటువంటి నిబంధనలన్నీ ఎత్తివేశారని సరుకు విరివిగా వచ్చేటందుకు కలక్టరుగారు ఆర్డరు కూడా వేశారని, గున్నయ్యసెట్టిని ఆమర్నాడే పట్నం బయలుదేరి తాశీల్దారుగారిని కలుసుకుని కావలసిన సరుకు తీసుకోవచ్చునని డబ్బు సర్దుబాటు అవ్వకపోయినా తకరారు లేదని ప్రజల అందరి ఎదుటా నివేదించి వెళ్లిపోయారు.


ఎలక్షనులు వచ్చాయి. అందరూ తమకు అన్నివిధాలా మేలుచేయబోతున్న ప్రసిడెంటుగారిక్కి మంత్రిగారిక్కి ఓట్లువేశారు. మొత్తంమీద ప్రజలందరూ సహకరించడంవల్ల ఈపర్యాయంకూడా పాత ప్రజాపాలకులే ఎన్నుకోబడ్డారు.

ఎలక్షనయిన మరునాడే ఇంజనీరింగువారు రావడం మానేశారు. ప్రజలు వాకబుచేస్తే ప్లానులయి పోయాయని, వస్తుసముదాయంతో పని ప్రారంభించడానికి కొద్దిరోజుల్లో ■స్తారని ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారు సెలవిచ్చారు. నాల్గోనాడు అకస్మాత్తుగా ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారికి ఇంకోవూరు బదిలీఅయింది. ప్రజలంతా తమ సంతాపాన్ని ఎంతో ఇదిగా తెలియపర్చి తే తేనీటివిందుతో సాగనంపారు.

వారంరోజుల తర్వాత కొన్ని అనివార్యకారణాలవల్ల ఎక్జిక్యూటివ ఆఫీసు ఎత్తివేయవలసి వచ్చిందని, కాలవమీద బ్రిడ్జి, చెరువు మరామత్తు, ఎలక్ట్రి, డబ్బుపరిస్థితులుఅనుకూలంగా లేకపోవడంవల్ల ప్రస్తుతం ఆపుచేయబడ్డాయని చల్లటి కబురు చేరింది.

గ్రామస్థులలో అలజడి ప్రారంభమయింది. మున్సీబు రాంనాయుడితో సహితం అందరూ అసలు సంగతి అర్థంకాక గ్రామచావడిలో సమావేశమయ్యారు. ఇంతలో అప్పుడే పట్టణంనుంచి వచ్చిన గున్నయ్య అల్లుడు తెల్లబడ్డ ముఖంతో కారణం లేకుండా తమ కోటాలన్నీ ఆపుచేయబడ్డట్టూ ఇక ముందుకూడా తమ గ్రామానికి ఎటువంటి కోటా లేనట్టూ తెలియచేశాడు.

అందరూ గొల్లుమన్నారు ముఖ్యంగా మున్సీబు రాంనాయుడుకు తెలివి తప్పిపోతున్నట్టవుతూ, ఊరావతల గొడ్డుబంజరు, పెద్దకొడుకు కాలవకాంట్రాక్టు, రెండోకొడుకు బస్సురూటు, మంత్రిగారి ప్రారంభోత్సవసందర్భంలో తను అదనంగా ఖర్చుపెట్టిన వెయ్యిరూపాయలు లీలగా కన్పించి మాయమయ్యాయి. అలానే స్తంభానికి జారబడిపోయాడు ప్రక్కనే వున్న కర్ణంగారి కొడుకు మిగిలిన కలంకాగితాలు కట్టగా కట్టి చంకను పెట్టుకుని 'ఈ త్రిశంకుస్వర్గం ఓటుగురించి' తనలో తాను గొణుక్కుంటూ చుట్టూవున్న పెద్దలని తప్పించుకుని వెళ్లిపోయాడు. ★




మేష్టరు: "మనకు ఏది ఎక్కువదూరంలో ఉంది-ఇంగ్లండా? చంద్రగోళమా?"

కుర్రాడు: "ఇంగ్లండేనండి."

మేష్టరు: "ఎందుచేత?"

కుర్రాడు: "చంద్రుణ్ణి ఇక్కణ్ణించే చూడగలమండి. ఇంగ్లండును అల్లా చూట్టానికి వీల్లేదండి."